మది నిండా.. మువ్వన్నెల జెండా

ఘనంగా స్వాతంత్య్ర దినోత్సవం


రాజీవ్‌నగర్‌లో పిల్లలతో కలసి జెండా ఆవిష్కరిస్తున్న మాజీ మేయర్ హరి వెంకటకుమారి

ఆరిలోవ: నియోజకవర్గంలో స్వాతంత్య్ర వేడుకలు ఘనంగా జరిగాయి. నియోజకవర్గంలోని అన్ని వార్డుల్లో ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, స్వచ్ఛంద సేవా సంస్థలు, ఆసుపత్రులు, ఇంకా అనేక ఇతర సంస్థలు ఈ పండుగను ఘనంగా నిర్వహించాయి. వివిధ ప్రాంతాల్లో జాతీయ జెండాను ఆవిష్కరించి దేశభక్తిని చాటుకున్నారు.

సెంట్రల్ జైలులో: విశాఖ కేంద్ర కారాగారంలో జైలు సూపరింటెండెంట్ ఎం. మహేష్ బాబు పరేడ్ గ్రౌండ్లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిబ్బంది చేసిన కవాతు అధికారులను ఆకట్టుకుంది. అనంతరం, జైలులోని ఖైదీలకు స్వీట్లు పంచారు. దేశం కోసం పోరాడిన మహనీయుల గురించి అధికారులు ఖైదీలకు వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్లు సాయిప్రవీణ్, సూర్యకుమార్, జవహర్ బాబు, జైలర్లు, డిప్యూటీ జైలర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విమ్స్‌లో: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్) ఆవరణలో డైరెక్టర్ డాక్టర్ కె. రాంబాబు జెండాను ఆవిష్కరించారు. ఈ ఏడాది రోగులకు ఉత్తమ సేవలు అందించిన వారికి మెరిట్ సర్టిఫికెట్లతో పాటు స్వీట్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విమ్స్‌లో ఉత్తమ వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్.ఎం.వోలు, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో: ఆరిలోవ పోలీస్ స్టేషన్ ఆవరణలో సీఐ హెచ్. మల్లేశ్వరరావు, లా అండ్ ఆర్డర్, క్రైమ్, ట్రాఫిక్ ఎస్.ఐలు, ఇతర సిబ్బందితో కలిసి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు, సిబ్బందికి స్వీట్లు పంచారు. ప్రభుత్వ బాలుర, బాలికల గృహాలలోనూ పర్యవేక్షణాధికారులు జాతీయ జెండాను ఎగురవేశారు. గృహాలలో ఉన్న పిల్లలకు స్వాతంత్య్ర దినోత్సవం ప్రాముఖ్యత గురించి వివరించారు.


జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు

విశాఖ వేలీ స్కూల్‌లో: విశాఖ వేలీ స్కూల్‌లో వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరి ప్రభాకర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. విద్యార్థులు చేసిన కవాతు ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను ఆకట్టుకుంది. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ స్వాతంత్య్రాన్ని కాపాడుకునే బాధ్యత నేటి విద్యార్థులపై ఉందని అన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో: ఆరిలోవ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలల్లో స్వాతంత్య్ర వేడుకలు ఘనంగా జరిగాయి. తోటగరువులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అలాగే పెదగదిలి, తోటగరువు, సంతపాలెం, పైనాపిల్ కాలనీ, శ్రీకృష్ణాపురం, రామకృష్ణాపురం, దీన్‌దయాళ్ పురం, పరేషన్ కాలనీ, భగత్‌సింగ్ నగర్, అంబేద్కర్ నగర్, గాంధీ నగర్, ఎస్.ఐ.జి. నగర్, ఇందిరానగర్, సంజీవి నగర్, జోడుగుళ్ళపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో ఆయా ప్రధానోపాధ్యాయులు జెండాను ఎగురవేశారు. పిల్లలకు స్వాతంత్య్ర దినోత్సవం గురించి వివరించారు.


విమ్స్‌లో జెండా ఆవిష్కరించి వందనం చేస్తున్న డైరెక్టర్ డాక్టర్ రాంబాబు

ఆరిలోవ ప్రెస్ క్లబ్: ముడసర్లోవ వద్ద ఆరిలోవ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో స్వాతంత్య్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్లబ్ ఆవరణలో పాత్రికేయులు జెండాను ఆవిష్కరించి స్వీట్లు పంచారు.

ముడసర్లోవ వాకర్స్ క్లబ్: ఈ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వాతంత్య్ర వేడుకలు సందడిగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత హాజరై జెండాను ఆవిష్కరించారు. వాకర్స్ సభ్యులకు నిర్వహించిన పోటీలలో విజేతలకు, సీనియర్ సభ్యులకు కార్పొరేటర్ బహుమతులు అందజేశారు.

విశాలాక్షినగర్ రెసిడెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్: అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వాతంత్య్ర వేడుకలు జరిగాయి. జెండాను ఆవిష్కరించిన అసోసియేషన్ ప్రతినిధులు సత్తి నాగేశ్వరరెడ్డి, సింహాద్రి రావు, ఇతర ప్రముఖులు సీనియర్ పెన్షనర్లను సత్కరించి మెమెంటోలు అందజేశారు.

దేశం పట్ల గౌరవం ఉండాలి

• 11వ వార్డు పరిధి రాజీవ్‌నగర్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో మాజీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అక్కడ పిల్లలు, స్థానిక పెద్దలతో కలసి ఆమె జాతీయ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాజీవ్‌నగర్ కమిటీ సభ్యులు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.


విశాఖ కేంద్ర కారాగారంలో జెండా ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరిస్తున్న సూపరింటెండెంట్ మహేష్‌బాబు

• 13వ వార్డులో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆధ్వర్యంలో స్వాతంత్య్ర వేడుకలు జరిగాయి. పార్టీ వార్డు కార్యాలయం ఆవరణలో నిర్వహించిన ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు పాల్గొని వార్డు అధ్యక్షుడు సత్యాల వెంకట్, నాయకులు, పాఠశాల చిన్నారులతో కలసి జాతీయ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్సీ విభాగం రీజనల్ కోఆర్డినేటర్ అల్లంపల్లి రాజబాబు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కె.శిరీషా పాల్గొన్నారు.

• కైలాసగిరి రిటైర్డ్ పోలీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వాతంత్య్ర దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్‌లో ఐదుగురు సీనియర్ సిటిజన్లను సన్మానించి గౌరవించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కర్రి సత్యనారాయణ, సభ్యులు ఎస్.వెంకటేశ్వరరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

• జీవీఎంసీ తొమ్మిదో వార్డు పరిధి విశాలాక్షినగర్‌లో ది విశాలాక్షినగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముగ్గురు సీనియర్ సభ్యులను సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు సత్తి నాగేశ్వరరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

వాడవాడలా..

ఎంవీపీకాలనీ: స్వాతంత్య్ర దినోత్సవాన్ని 19వ వార్డ్ జాలరిపేట ఆదర్శగ్రామ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు ముఖ్యఅతిథిగా పాల్గొని జెండా ఆవిష్కరించి సీట్లు పంపిణీ చేశారు. 20వ వార్డ్ కార్పొరేటర్ మువ్వల లక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు సూరాడ దాసు, మువ్వల సురేష్, సూరాడ వెంకటలక్ష్మీ, బాబిరెడ్డి, అప్పల స్వామి, పోలి రెడ్డి, చిరంజీవి, సత్యం, సతీష్, అరుణ్ రాజు, శివప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఇగ్నో ఆధ్వర్యంలో...: ఇగ్నో ఆధ్వర్యంలో స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా సంస్థ విశాఖ ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ గొనిపాటి ధర్మారావు జాతీయ జెండాను ఆవిష్కరించారు.


జెండా ఎగురవేస్తున్న నెహ్రూ యువకేంద్రం డీడీ మహేశ్వర రావు


ఇసుకతోటలో స్వాతంత్య్ర వేడుకల్లో పాల్గొన్న మొల్లి అప్పారావు


ఏయూలో సాంస్కృతిక ప్రదర్శనలు

శ్రీ సత్యసాయిలో..: శ్రీ సత్యసాయి విద్యావిహార్‌లో స్వాతంత్య్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంస్థ పూర్వవిద్యార్థి, నెక్కంటి సీ ఫుడ్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ వెంకట్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో శ్రీ సత్యసాయి విద్యా విహార్ ప్రిన్సిపల్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకార పాఠశాలలో..: ఎంవీపీకాలనీ వాసవానిపాలెంలోని మత్స్యకార పాఠశాలలో నిర్వహించిన స్వాతంత్య్ర వేడుకల్లో లయన్స్ క్లబ్ ద్వారకానగర్ అధ్యక్షుడు పీఎస్‌వీ గణేష్, కార్యదర్శి తేజేశ్వర రావు, పేర్ల బాస్కరరావు, పాఠశాల హెచ్‌ఎం సత్య వేణి తదితరులు పాల్గొని విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ఎంవీపీరైతు బజార్‌లో..: ఎంవీపీ కాలనీ రైతు బజార్‌లో ఎస్టేట్ అధికారి వరహాలు జెండాను ఆవిష్కరించి రైతులకు, వినియోగదారులకు సీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వినియోగదారుల ఫోరం సభ్యులు వసంతరావు, సత్యకుమార్, బాస్కరరావులతో సిబ్బంది కనకరాజు పాల్గొన్నారు.

మహనీయుల బాటలో నడుద్దాం


చిన్నారులకు పుస్తకాలను అందిస్తున్న మొల్లి అప్పారావు

బీచ్‌రోడ్డు: నియోజకవర్గంలో స్వాతంత్య్ర వేడుకలు ఘనంగా జరిగాయి. జీవీఎంసీ 28వ వార్డులో, సంతోషిమాత కాలనీ సంఘం ఆధ్వర్యంలో జరిగిన జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు హాజరయ్యారు. స్వాతంత్య్రం కోసం త్యాగాలు చేసిన మహనీయులను ఆయన స్మరించుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు స్వీట్స్, పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు, కార్పొరేటర్ పల్లా అప్పలకొండ, నియోజకవర్గం ప్రచార విభాగం అధ్యక్షులు సంపంగి సురేష్,వార్డు అధ్యక్షుడు రాపాక శ్రీనివాస్ మరియు సంఘం అధ్యక్ష కార్యదర్శులు కమిటీ సభ్యులు, చిన్నారులు,యువకులు పాల్గొన్నారు. జీవీఎంసీ 20వ వార్డులోని బాల్ భవన్ పార్క్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు కార్పొరేటర్ మువ్వల లక్ష్మి సురేష్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఎగురవేశారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆంధ్రప్రదేశ్ సరవోదయ మండల్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఏపీ సీబీడీ డైరెక్టర్ వి.హెచ్.ఎల్. నగేష్ జాతీయ జెండాను ఆవిష్కరించి మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సమష్టిగా పని చేద్దాం... ప్రగతిని సాధిద్దాం

మద్దిలపాలెం: సమిష్టిగా పనిచేస్తూ విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి చేసే దిశగా కృషి చేద్దామని ఆంధ్ర విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ పిలుపునిచ్చారు. స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆంధ్ర విశ్వవిద్యాలయం న్యాయ కళాశాల ఎదురుగా ఉన్న బాస్కెట్ బాల్ మైదానంలో శుక్రవారం జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం ఎన్. సి.సి క్యాడిట్స్ నుంచి గౌరవ వందనాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య ఎన్. కిషోర్ బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్ ధనంజయ రావు, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపల్స్, పలువురు డీన్లు అధికారులు తదితరులు పాల్గొన్నారు. డా.వి.ఎస్.కృష్ణ ప్రభుత్వ కళాశాలలో ప్రిన్సిపాల్ డా.ఐ. విజయబాబు డిగ్రీ కళాశాలలో, ప్రిన్సిపాల్ సుజాత జూనియర్ కళాశాలలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఎన్‌సీసీ రెడ్ క్రాస్ విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. కళాశాలలో విద్యార్థుల విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఐ.విజయబాబు మాట్లాడారు.

• మద్దిలపాలెం పిఠాపురంకాలనీలో గల మలేరియా సబ్ యూనిట్ కార్యాలయంలో స్వాతంత్య్రదినోత్సవాన్ని నిర్వహించారు. సబ్‌యూనిట్ అధికారి నగేష్ పట్నాయిక్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

16వ వార్డులో ..

జీవీఎంసీ 16వ వార్డులోని కే.ఆర్.ఎం. కాలనీ, శ్రీ వరసిద్ధి వినాయక సంఘం, శ్రీ లక్ష్మీ గణపతి సంఘం, మరియు ఇసుకతోట అంబేద్కర్ కాలనీ సంఘాలు సంయుక్తంగా నిర్వహించిన స్వాతంత్య్ర వేడుకల్లో వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘాల ప్రతినిధులు, చిన్నారులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


ఎన్‌సీసీ క్యాడెట్ల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న వీసీ ఆచార్య రాజశేఖర్

ఎన్‌వైకేలో..

ఏయూక్యాంపస్: స్వాంతత్య్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని బీచ్‌రోడ్డులోని నెహ్రూ యువ కేంద్రంలో జాతీయ పతాకాన్ని డిప్యూటీ డైరెక్టర్ జి.మహేశ్వరరావు ఎగురవేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికసిత్ భారత్‌లో భాగంగా అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూత్ హాస్టల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


సాంస్కృతిక కార్యక్రమాల్లో శ్రీ సత్యసాయి విద్యార్థులు


ఆరిలోవ పోలీస్ స్టేషన్ వద్ద జెండా ఆవిష్కరిస్తున్న సీఐ మల్లేశ్వరరావు


విశాఖవ్యాలీలో శాంతికపోతాలు ఎగురవేస్తున్న ప్రిన్సిపాల్ ఈశ్వరిప్రభాకర్


శ్రీకృష్ణాపురం గురుకులంలో వివిధ వేషధారణలో విద్యార్థులు


ఫిషర్‌మెన్ కాలనీ పాఠశాలలో జెండా ఆవిష్కరిస్తున్న అతిథులు

క్లుప్తంగా

క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ పతాకావిష్కరణ


జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

బీచ్‌రోడ్డు: 79వ స్వాతంత్య్ర వేడుకలను పురస్కరించుకుని ఏయూ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన జెండాకు గౌరవ వందనం సమర్పించి, అక్కడ ఉన్న అధికారులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో కలెక్టర్ సతీమణి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక భవనం ప్రారంభం


సామాజిక భవనాన్ని ప్రారంభిస్తున్న మొల్లి అప్పారావు

మద్దిలపాలెం: జీవీఎంసీ 16వ వార్డులోని ఇసుకతోట అంబేద్కర్ కాలనీలో, మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ నిధులతో నిర్మించిన కమ్యూనిటీ హాలు రెండో అంతస్తును ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా మొల్లి అప్పారావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆ తర్వాత కమ్యూనిటీ హాలులోని సమావేశ మందిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కంచుమూర్తి సన్యాసి నాయుడు, కార్యదర్శి కంచుమూర్తి ఈశ్వరరావు, గౌరవ అధ్యక్షుడు బొచ్చ లక్ష్మణ రావు, కోశాధికారి కంచుమూర్తి విజయ్, మాజీ అధ్యక్షులు గుర్ల వెంకటరమణ, పెందుర్తి వెంకటేష్, మాజీ కోశాధికారి కంచుమూర్తి అప్పారావు, జాయింట్ సెక్రెటరీ మచ్చ త్రినాథ్, రాఖీలతో పాటు కమిటీ సభ్యులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మెడికవర్‌లో 'వందే మాతరం హెల్త్ చెకప్ ప్యాకేజీ'

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ మెడికవర్ ఆస్పత్రిలో స్వాతంత్య్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. డాక్టర్ అల్లెన ప్రేమ్‌కుమార్ అతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఇండిపెండెన్స్ డేని పురస్కరించుకొని రూ.1947తో 'వందే మాతరం హెల్త్ చెకప్ ప్యాకేజీ' హాస్పటల్ ద్వారా అందుబాటులోకి తెచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. సెప్టెంబర్ 15 వరకు ఈ ప్యాకేజీ అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో సెంటర్ హెడ్ డాక్టర్ అరుణ్‌కుమార్‌తో పాటు డాక్టర్ తాతినేని సురేష్, డాక్టర్ మోహన్ మహారాజ్, డాక్టర్ నరేంద్ర బెండి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు


మాజీ మేయర్ హరి వెంకటకుమారి

డాబాగార్డెన్స్: నగర ప్రజలు శ్రీకృష్ణ జన్మాష్టమి పండగను సంతోషంగా జరుపుకోవాలని మాజీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీకృష్ణుని ఆశీస్సులు నగర పౌరులపై ఉండాలని ఆకాంక్షించారు.

భీమవరం బుల్స్ బేజారు

విశాఖ స్పోర్ట్స్ : ఏపీఎల్ నాలుగో సీజన్‌లో భాగంగా శుక్రవారం వైఎస్సార్ స్టేడియంలో జరిగిన రెండో మ్యాచ్‌లో భీమవరం బుల్స్‌పై తుంగభద్ర వారియర్స్ విజయం సాధించింది. వర్షం కారణంగా మ్యాచ్‌ను 18 ఓవర్లకు కుదించగా తొలుత బ్యాటింగ్ చేసిన తుంగభద్ర వారియర్స్ 6 వికెట్లు కోల్పోయి 151 పరుగులు చేసింది. జ్ఞానేశ్వర్ (24), ప్రశాంత్(40), కెప్టెన్ మహీప్‌కుమార్(41) రోహిత్ (24) బ్యాటింగ్‌లో రాణించగా.. సత్యనారాయణ రెండు,శివ, తేజస్వి, హేమంత్ ఒకో వికెట్ తీశారు. 152 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన భీమవరం బుల్స్ 28 పరుగులకే ఆరు వికెట్లు చేజార్చుకుంది. ఈ దశలో శ్రవణ్‌కు సాత్విక్(43) తోడై స్కోర్‌ను 122కు చేర్చారు. చివరికి 18 ఓవర్లలో ఎనిమిది వికెట్లకు 138 పరుగులతో ఇన్నింగ్స్ ముగిసింది. శ్రావణ్ 76 పరుగులతో నిలిచాడు. సౌరబ్ నాలుగు, శశికాంత్, స్టీఫెన్ చెరో రెండు వికెట్లు తీశారు. తొలుత వైఎస్సార్ స్టేడియంలో ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి సానా సతీష్ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఎగురవేశారు.

వర్షంతో ఏపీఎల్ మ్యాచ్ రద్దు

రాయల్స్ రాయలసీమ- సింహాద్రి వైజాగ్ లయన్స్ మధ్య జరగాల్సిన తొలి మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. ఇరు జట్లకు ఒకో పాయింట్‌ను కేటాయించారు.

వైభవంగా బాలగోపాలుడి ఉయ్యాల సేవ

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలోని గాదిరాజు ప్యాలెస్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. హరే కృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఆగస్టు మూడు రోజులు జరగనున్నాయి. వేడుకల తొలిరోజు శుక్రవారం ఎంపీ శ్రీభరత్, హరే కృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు డా. నిష్కించన భక్తదాసలు పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. బాలగోపాలుడిని ప్రత్యేకంగా అలంకరించి, సప్తనదుల జలాలు, పంచామృతం, పండ్ల రసాలతో అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా బృందావనం నుంచి వచ్చిన లడ్డు గోపాలునికి ఉయ్యాల సేవ నిర్వహించారు.ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.



ప్రత్యేక అలంకరణలో బాలగోపాలుడు, బాల గోపాలుడికి ఉయ్యాలసేవలో భక్తులు